

కొమ్ము తలపాగాతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

మార్చ్‌ఫాస్ట్

సివిల్ పవర్ చూపుతాం!



కలెక్టర్లు.. ఎస్పీలూ క్రీడా పోటీలు ఊహించగలమా.. కాస్త కష్టమే.. ఎందుకంటే జిల్లాకో కలెక్టర్.. ఎస్పీ ఉంటారు.. వీళ్ల మధ్య క్రీడాపోటీలు ఎలా జరుగుతాయని ఆశ్చర్యపోతున్నారా!? 2024 -25 సివిల్ సర్వీసెస్ ఆలిండియా పురుషులు.. మహిళల హాకీ టోర్నమెంట్ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైంది.. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన క్రీడాకారులు 44 జట్లుగా ఏర్పడి తలపడుతున్నారు.. మన మధ్యకు వచ్చి ఈ నెల 28వ తేదీ వరకూ మేమూ ఆడతాం.. ప్రతిభ చాటుతాం అంటున్నారు.. - వివరాలు 6లో



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మా ఆట చూపుతాం : క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్



మార్కెట్.. చిక్కేనా!

సండే.. చికెన్ ఆశలు

వండుకు తింటే.. ప్రభావం ఉండదంటున్న వైద్యులు



ఆదివారం అంటేనే నాన్‌వెజ్ డే. మాంసాహార ప్రియులు ఎప్పుడొస్తుందా ఎదురుచూసే రోజు. ఆ రోజు ముక్కలేనిదే ముద్ద దిగదు.. చికెన్, మటన్, చేప, రొయ్యలకు డిమాండ్.. వీటిలో చికెన్ అంటే పెద్దలు, పిల్లలూ ఇష్టపడతారు. అందులోనూ చికెన్ బిర్యానీదే పైచేయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఈ ఆదివారం మాంసాహార ప్రియులు ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. వారాంతపు రోజు కావడంతో ఈ ఒక్కరోజే వందలాది టన్నుల చికెన్ అమ్మకాలు, లక్షలాది గుడ్ల అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రభావంతో కొన్నిచోట్ల చికెన్ అమ్మకాలు పడిపోయాయి. హోటళ్లలోనూ ఆర్డర్లు పడిపోయాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు కోళ్ల పరిశ్రమ రంగంలోకి దిగింది. ప్రభుత్వం కూడా కొంత అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టింది. చికెన్ వండుకుని తినడం వల్ల ఎలాంటి హాని జరగదని వైద్యులు సైతం చెబుతున్నారు. కోడి గుడ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆదివారం రానేవచ్చింది.. నేడు పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన పరిశ్రమ వర్గాల్లో నెలకొంది. సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కోళ్ల పరిశ్రమ బయటపడే అవకాశం ఉంది.

అనపర్తి/మండపేట/ఉండ్రాజవరం/ అమలాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వచ్చిందని తెలియగానే చాలాచోట్ల చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిని సైతం వండుకుని తింటే మనుషులకు ఏమీ కాదని ఒకవైపు ప్రచారం జరుగుతున్నా ఇదిగో పులి అంటే అదిగో మేక అన్న చందంగా అసత్య ప్రచారాలతో కోడిమాంసం, గుడ్లు అమ్మకాలు పడిపోయాయి. దీంతో రైతులు కోళ్ల రేట్లను గణనీయంగా తగ్గించారు. మొన్నటి వరకు లైవ్ బాయిలర్ కిలో రూ.115 నుంచి 120 ఉండగా ప్రస్తుతం అది రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఫారం కోడి ధర లైవ్ రూ.90 పలుకగా ఇప్పుడు రూ.70కు ఇస్తున్నారు. ఇక గుడ్ల ధర విషయానికి వస్తే మొన్నటి వరకు పేపరు ధర రూ.4.90 ఉండగా నేడు రూ.4.55కు పడిపోయింది. కొన్ని చోట్ల ట్రేడర్లు మరింత దిగువకు కొనుగోలు చేస్తున్నారని పరిశ్రమ వర్గాలు ఒకటే గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు పౌల్ట్రీల వద్ద బర్డ్‌ఫ్లూ సోకకుండా తమ కోళ్లను రక్షించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క కానూరు మినహా మిగిలినచోట్ల బర్డ్‌ఫ్లూ వ్యాపించిన ఘటనలు లేవు. అయినా మొత్తం మార్కెట్‌పై బర్డ్‌ఫ్లూ ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమలో గుడ్లు ఇవ్వండి!

కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకూ ఎక్కడ ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కాలేదు. జిల్లాలో 52 కమర్షియల్ పౌల్ట్రీ ఫార్మ్‌లో 32 లక్షల కోళ్లు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీల్లో 24 లక్షల కోళ్లు ఉన్నాయి. వీటిలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో తిరిగి కోడిగుడ్లను బాగా ఉడికించి పిల్లలకు అందించండి. జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు జిల్లాలోకి రావడంపై ఆంక్షలు విధించాం. బర్డ్‌ఫ్లూ కేసులు లేనందున జిల్లాలోకి అనుమతించండి. మాంసం విక్రయదారులపై ఆంక్షలు విధించవద్దు.

- మహేష్‌కుమార్, కలెక్టర్

మటన్‌కు డిమాండ్.. కానీ..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చికెన్‌ప్రియులను బర్డ్‌ఫ్లూ భయపెడుతుండడంతో గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరం సిటీలో చికెన్ అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. సిటీలోనే ప్రధాన కోళ్ల మార్కెట్‌గా పేరొందిన జాంపేట కోళ్ల మార్కెట్ శనివారం దాదాపుగా బోసిపోయి కనిపించింది. ఇదిలా ఉంటే బర్డ్‌ఫ్లూ భయంతో చాలా హోటళ్లలో మెనూ మారిపోయింది. కర్రీ పాయింట్లలోనూ చికెన్‌కు ప్రాధాన్యం తగ్గింది. చికెన్ స్థానంలో కొత్తగా మటన్ వచ్చి చేరుతోంది. చాలామంది హోటల్ యజమానులు చికెన్ వెరైటీలను తగ్గించేసి మటన్ ప్రమోట్ చేస్తున్నారు. దీంతో మటన్ వ్యాపారులు ఒక్కసారిగా ధరలు పెంచేశారు. బర్డ్‌ఫ్లూ ముందు వరకూ కిలో రూ.800-రూ.880 ఉన్న కిలో మటన్ ధర ఇప్పుడు రూ.950కి చేరి సామాన్యులకు అందుబాటులో లేకపోయింది.




- బర్డ్‌ఫ్లూ దెబ్బకు మార్కెట్ కుదేలు
- చికెన్‌కు దూరమైన జనం
- తినేందుకు జంకుతున్న వైనం
- ఏమీ కాదంటున్న వైద్యులు
- అయినా మారని తీరు
- అసత్య ప్రచారాలతో నష్టాలు
- పడిన గుడ్ల వినియోగం
- రూ.4.50కు గుడ్డు ధర
- చికెన్ ధర తగ్గుముఖం
- యజమానుల లబోదిబో

కోట్లలో నష్టపోతున్నాం..

రాష్ట్రంలో కోడిగుడ్ల ఎగుమతులపై బర్డ్‌ఫ్లూ ప్రభావం పడడం వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. దీనివల్ల రోజుకు రూ.2.5 కోట్లు నష్టపోతున్నాం. ఇక మాంసానికి విక్రయించే కోళ్ల నష్టం రోజుకు సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. కోడిగుడ్లు, మాంసానికి విక్రయించే కోళ్ల వాహనాలను రాష్ట్ర సరిహద్దుల్లో నిలిపివేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతుల నిలుపుదలతో పాటు స్థానికంగానూ గుడ్ల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికీ గుడ్లను నిలిపివేశారు.

- కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



సన్‌డే..ఆశలు

చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో మొన్నటి వరకు కిలో రూ.220 అమ్మిన స్కిన్‌లెస్ బాయిలర్ మాంసం ధర నేడు రూ.190కి పడింది. అయినప్పటికీ తగ్గకుండా ధర నిలబెట్టేందుకు పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే వైద్యులు సైతం చికెన్, గుడ్లు పచ్చివి మాత్రమే తినకూడదని.. వండిన తర్వాత ఎలాంటి వైరస్ ఉండదని.. కాబట్టి తినొచ్చని చెబుతుండడంతో ఆదివారం మార్కెట్ తమను ఆదుకుంటుందనే ఆశతో కోళ్ల రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం 30 వేల బాయిలర్ కోళ్ల విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం 50 వేలకుపైబడి బాయిలర్ కోళ్లను విక్రయిస్తారు. లేయర్ కోళ్ల విషయానికి వస్తే 25 వేల కోళ్ల విక్రయాలు సాగుతుండగా, ఆదివారం ఒక్కరోజే 40 వేల కోళ్లు విక్రయిస్తారు. ఈ ఆదివారం మార్కెట్ చిక్కాలని ఆశగా ఉన్నారు.



గుడ్డుకు.. బ్యాడ్ డేస్..

బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగంతోపాటు గుడ్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. నిన్న మొన్నటి వరకు రూ.4.90 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రూ.4.55కు పడిపోయింది. చిల్లర ధర మాత్రం నేటికీ రూ.6లు ఉన్నప్పటికీ వినియోగదారులు మొగ్గు చూపకపోవడంతో చిల్లర అమ్మకాలు నిలిచిపోయాయి.ఈ ప్రభావం కేక్‌లపై కూడా పడింది. చాలామంది కేక్‌లు తినేందుకు ఇష్టపడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి 1.30 కోట్ల మేర ఉండగా స్థానికంగా వినియోగం 30 శాతం ఉంటుంది. మిగిలిన 70 శాతం గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మేఘాలయ తదితర రాష్ట్రాలకు ఎగుమతవుతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో మన ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడలేదు. కానీ ట్రేడర్లు బర్డ్‌ఫ్లూ భూతం చూపి కొంత ధర తగ్గించినట్టు చెబుతున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

మొత్తం ఓటర్లు 3,14,984

అత్యధికం కాకినాడ జిల్లా.. ఓటర్లు 70,504

అత్యల్పం అల్లూరు జిల్లా .. ఓటర్లు 4,669

తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు.. 62,970

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఓటర్లు.. 64,471 6



ఏమండోయ్.. మేమండి!

సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు

6 లక్షల మంది అభిమానం సొంతం

మొత్తం నాలుగు వేల వీడియోలతో ఓ రికార్డు

కడియపులంక నుంచి తెలుగువాళ్ల ప్రపంచంలోకి.. 6



మీడియాతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

వైసీపీ కౌన్సిలర్లు స్వచ్ఛందంగానే టీడీపీలోకి : అశోక్‌బాబు

తుని రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తునిలో వైసీపీ కౌన్సిలర్లు స్వచ్ఛందంగానే టీడీపీలోకి చేరారని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు స్పష్టంచేశారు. అరాచక పాలనతో తునికి దౌర్జన్యాల మరక అట్టించిన మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాకు ప్రజాతీర్పు ఎందుకిలా వచ్చిందో విశ్లేషించుకుంటే బాగుంటుందన్నారు. తన నివాసంలో కూటమిన నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతం నీడి అబ్బాయి, యనమల లక్ష్మణరావు, అరిగెల నర్సింహమూర్తి, బోనం చినబాబు, తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన అశోక్‌బాబు దాడిశెట్టి రాజాపై ధ్వజమెత్తారు. వైకాపా కౌన్సిలర్లను ఎవరూ ప్రలోభ పెట్టలేదన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి అడుగంటిపోయిందని, వార్డుల అభివృద్ధి కోసం యనమల నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు వచ్చారన్నారు.

తునిలో.. తాడోపేడో



- వేడెక్కిన తుని రాజకీయం.. వైసీపీలో ఫిరాయింపుల బాట
- మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సరికొత్త వ్యూహాలు
- సైకిల్ ఎక్కుతున్న వైసీపీ కౌన్సిలర్లు.. ఇప్పటికి పది మంది..

తుని రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీలో వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తునిలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పట్టు కాపాడుకోవడం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరు హోరాహోరీగా మారింది. ఎలాగైనా వైస్‌చైర్మన్ పదవి తమ ఖాతాలో వేసుకుని పైచేయి సాధించాలని తలిచిన వైసీపీ క్యాంప్ రాజకీయాలకు తెరతీసింది. అప్పటికే గుర్రుగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లను దారిలోకి తెచ్చుకునేందుకు వీరందరినీ ముందస్తుగా వాహనంలో ఏజెన్సీ ప్రాంతాలకు తరలించింది. ఈనెల 3వ తేదీన జరిగిన వైస్‌చైర్మన్ ఎన్నికకకు కౌన్సిలర్లతో సహా మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యక్షమవడంతో కూటమి నేతలతో పాటుగా పలువురు ప్రజాసంఘాల నేతలు, దళిత సంఘాల నాయకులు వీరిని అడ్డుకున్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికలకు కౌన్సిలర్లను మూకుమ్మడిగా తీసుకురావడం ఏమిటమని అడ్డుపడడంతో ఆ ఎన్నిక వాయిదా పడింది. తాజాగా ఎన్నికల కమిషన్ ఈ నెల 17న తునిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక పెట్టేందుకు సిద్ధమైంది. దీంతో వైసీపీ కౌన్సిలర్లు వరుసగా సైకిల్ ఎక్కడంతో వైసీపీ ఉలికిపాటుకు గురవుతోంది. ఎలాగైనా తుని పురపాలక సంఘంలో వైస్‌చైర్మన్ పదవి దక్కించుకునేందుకు వైసీపీ ఆరాటపడుతున్నప్పటికీ, ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తితో రగులుతున్న వైసీపీ కౌన్సిలర్లంతా టీడీపీలోకి చేరుతుండడంతో ఆందోళన చెందుతోంది. మరింత మంది కౌన్సిలర్ల చేరిక ఖాయమంటూ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తుండడంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. 17న తుని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సజావుగా జరిపించాలని వైసీపీకి చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించగా, ఇప్పటికే ఎన్నికల అధికారులతో పాటుగా ప్రభుత్వ యంత్రాంగానికి త్వరలో వైస్ చైర్మన్ ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. తునిలో హాట్ టాపిక్‌గా మారిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో ఏ పార్టీపై చేయి సాధిస్తుందో వేచిచూడాలి.

టీడీపీలోకి మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు

తుని మున్సిపాలిటీలో గతంలో ఒక వైసీపీ కౌన్సిలర్ టీడీపీలో చేరగా, ఇటీవల మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. శనివారం మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిలో వారిలో 12వ వార్డు కౌన్సిలర్ బి. వెంకటదారేష్, 19 వ వార్డు కౌన్సిలర్ ఆచంట సురేష్, 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ, 29వ వార్డు కౌన్సిలర్ దాశపర్తి రాజేశ్వరి, 30వ వార్డు కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరీవనజ, 20వ వార్డు రాసబోయిన అప్పయ్యమ్మ టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కూటమి నేత రాజా అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ కౌన్సిలర్లపై బెదిరింపులకు దిగడం దారుణం : మాజీ మంత్రి రాజా

తుని రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యేగా, పెద్దమనిషిగా ఉన్న రాజా అశోక్‌బాబు ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న వైసీపీ కౌన్సిలర్లపై బెదిరింపులకు దిగడం దారుణమని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తునిలో టీడీపీకి ఎలాగూ విలువలు లేవని, అందుకే అశోక్‌బాబును రంగంలోకి దింపారని విమర్శించారు. దాడిశెట్టి రాజా నివాసంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో పోలీసులను ఉపయోగించుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఇటీవల జరిగిన దౌర్జన్యంతో వైసీపీ కౌన్సిలర్లు కోర్టుకు వెళ్లారని, దీంతో కోర్టు ప్రశాంత వాతావరణంలో ఎన్నిక నిర్వహించే బాధ్యత అధికారులపై ఉందని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. న్యాయం తమ పక్షాన ఉందని, వైస్ చైర్మన్ ఎన్నికలో గెలిచి తీరుతామని చెప్పారు.



స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో వెంకట్రావు

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనే విధంగా అధికారులు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన కలెక్టరేట్ సిబ్బందితో కలిసి శనివారం కలెక్టరేట్‌తోపాటు వికాస కార్యాలయాలు, పౌరసరఫరాల కార్యాలయాలను స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా శుభ్రపర్చారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకట్రావు స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, మురికి కాలువలు వంటివి శుభ్ర చేయడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆవరణలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, కలెక్టరేట్ విభాగ అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఏవండోయ్ మేమండీ..



సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు

6 లక్షల మంది అభిమానం సొంతం



కుకింగ్ వీడియోలో..

'ఏవండోయ్' అంటూ ఒకాయన తన జీవిత భాగస్వామితో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో చెప్పే ముచ్చట్లు, చూపించే వీడియోలకు లక్షలాది మంది ఫాలోవర్స్ ఫ్యాన్స్‌గా మారిపోయారు. తన భార్యను భుజానకెత్తుకుని తిరుపతి మెట్లు ఎక్కి ఫేమస్ అయిన రోజు నుంచే 'సోషల్ మీడియా'ను కూడా భుజానకెత్తుకుని సెలబ్రిటీలుగా మారిపోయారు..తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతుల ఏవండోయ్ అనే పలకరింపు ఫేమస్ అయ్యి లక్షలాది మంది అభిమానాన్ని మూటకట్టింది..

కడియం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):





ఒకాయన మూడేళ్ల క్రితం తన భార్యను భుజానకెత్తుకుని తిరుమల మెట్లు ఎక్కారు. దీంతో ఒక్కరోజులోనే సోషల్ మీడియాలో స్టార్ అయిపోయారు. ఆ వీడియో చాలా రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోతో ఆ భార్యాభర్తలు ఫేమస్ అయిపోయారు. సెలబ్రిటీలుగా మారిపోయారు. వారే తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతులు..'ఏవండోయ్' అంటూ వీళ్లు చెప్పే ముచ్చట్లు..చూపించే అందమైన పరిసరాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు అబ్బురపరుస్తాయి. మూడేళ్ల క్రితం వరకు వారు ఎవరికీ తెలియదు. అయితే కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన తిరుమల కొండ ఎక్కుతూ కొంత దూరం సత్తిబాబు భార్య లావణ్యను భుజాల మీద ఎత్తుకుని మెట్లు ఎక్కడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. అన్ని న్యూస్ ఛానళ్లలో అదే న్యూస్ అయిపోయింది. దీంతో వారు ఆ గుర్తింపును కొనసాగించాలనుకుని సోషల్ మీడియాలో అడుగుపెట్టారు.

అభిమానుల ఆదరణ మరిచిపోలేం..

కడియపులంకలో లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వహించేవారమని, సోషల్ మీడియా ద్వారా లభించిన ఆదరణ మర్చిపోలేమని సత్తిబాబు-లావణ్య దంపతులు తెలిపారు. కేవలం ప్రజలకు మంచి సందేశాత్మకమైన సమాచారాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో తాము చేస్తున్న వీడియోలకు వస్తున్న గుర్తింపు జీవితంలో మరువలేమని అన్నారు. తమను ఆదరిస్తున్న ప్రతీఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

6 లక్షల మంది ఫాలోవర్స్



కడియం నర్సరీలో వీడియో..

'సత్తిబాబు కడియపులంక' పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఈ దంపతులకు సుమారు 6 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. దీంతో వారు ఎలాంటి మెసేజ్ ఇచ్చినా క్షణాల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఏ ప్రాంతంలో ఉన్న తెలుగువారికైనా చేరిపోతుంది. రోజు రోజుకూ వీరి అభిమానుల సంఖ్య పెరుగుతూ వస్తోంది..

నర్సరీలకు గుర్తింపు

కడియం నర్సరీ రంగానికి సంబంధించి వార్తా కథనాలు ఎప్పటికపుడు వెలువడుతూనే ఉంటాయి. అయితే ఈ దంపతులు ఈ నర్సరీల్లో ఉండే దేశ విదేశాలకు చెందిన మొక్కల ప్రత్యేకతలను వివరించడంతో మరింత ప్రాచుర్యం పొందాయి. ఏ నర్సరీలో ఎలాంటి ప్రత్యేకత మొక్క వచ్చినా ఈ దంపతులు వాటి వివరాలను క్షుణ్ణంగా ప్రజలకు చేరవేస్తున్నారు. అలంకరణ, పుష్పాలు, ఔషధాలు వంటి మొక్కల వివరాలు చెబుతూ వారు చేస్తున్న వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

4 వేల వీడియోలు..

ఇప్పటి వరకు ఈ దంపతులు సుమారు 4 వేల వీడియోలను సోషల్ మీడియా ముందు ఉంచారు. నర్సరీ రంగంతో పాటు ఈ ప్రాంతంలో ఉండే ప్రముఖ దేవాలయాలు, మండువా లోగిళ్ల ఇళ్లు, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్న ఆస్పత్రుల వివరాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొన్ని సౌకర్యాలను లావణ్య-సత్తిబాబు దంపతులు వివరిస్తూ వస్తున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

● అత్యధికం కాకినాడ... అత్యల్పం అల్లూరు జిల్లా ● మొత్తం ఓటర్లు 3,14,984

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల లెక్క తేలింది.ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలిం గ్ జరగనున్న విషయం తెల్సిందే. ఓటర్ల చేర్పులకు ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసిన ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇవ్వగా, స్వల్పంగా హెచ్చు, తగ్గులు ఆయా జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. ఓవరాల్‌గా లెక్క తేలారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా 456 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారు. ఓటర్లపరంగా కాకినాడ జిల్లాలో అత్యధికంగా 70,542 మంది ఉండగా, అత్యల్పంగా అల్లూరు సీతారామ రాజు జిల్లాలో 4,669 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. ఈ సారి ఏలూరు జిల్లాలో వెయ్యి ఓట్ల కంటే ఎక్కువ మంది ఉన్నచోట్ల నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా పెంచారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా ఇలా..

వరుసనెం	జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ట్రాన్‌జెండర్	మొత్తం
1	అల్లూరి	12	2,842	1827	0	4669
2	కోనసీమ	95	37,114	27,355	2	64,471
3	తూర్పు	92	36,361	26,606	3	62,970
4	ఏలూరు	66	24,704	17,571	7	42,282
5	కాకినాడ	98	42,463	28,072	5	70,504
6	పశ్చిమ	93	38,863	30,187	2	70,052
	మొత్తం - 456		1,83,347	1,31,618	19	3,14,984

పట్టభద్రులూ ఓటెయ్యడానికి ఈ అర్హతాపత్రాలు చూసుకోండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు లిస్టులో ఉంటే సరిపోదు. దీనికి సంబంధించి అర్హతా పత్రంను గ్రాడ్యుయేట్ కలిగి ఉండాలి.అవి ఇవే.. ఓటరు ఐడీ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, డిగ్రీ అర్హతా సర్టిఫికెట్లు, ప్రవేట్ సంస్థల్లో పనిచేసే వారి హోదాతో జారీ చేసే కార్డులు సరిపోతాయి. బీఎల్‌వోలు ఇంటింటా వచ్చి ఓటరు స్లిప్పులిచ్చి సమాచారం తెలియజేస్తారు. అయితే ఈ స్లిప్‌లు కేవలం ఎంట్రీకి ఉపయోగపడతాయి. ఓటరు తన అర్హతా పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్ళాలి. ఇందులో ప్రాధమిక సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలి.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

● రిటర్నింగ్ ఆఫీసర్ వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యానికి అవకాశం కల్పించినట్లు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల నిమిత్తం విధుల్లో పాల్గొనే సిబ్బంది వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని అన్నారు. దీనికి ఫారం - 12ను జిల్లా రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కేంద్రానికి ఈనెల 20వ తేదీ సాయం త్రం ఐదు గంటల్లోగా సిబ్బంది సమర్పిం చాలన్నారు. సిబ్బంది ఫారం-12ను ఏలూరు. ఏపీ.జీవో.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు జిరాక్స్‌లు జతపర్చాలని ఆమె కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.



స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వస్తున్న న్యాయమూర్తి మహేశ్వరి

క్రీడా సంరంభం



వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్



గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

- అట్టహాసంగా ప్రారంభమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ
- వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు
- తొలిరోజు అంబరాన్నంటిన సంబరాలు
- పతకాలతో క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్
- క్రీడా జ్యోతిని వెలిగించి టోర్నీని ప్రారంభించిన కాకినాడ కలెక్టర్
- వెయ్యిమంది క్రీడాకారులతో కిక్కిరిసిన జిల్లా క్రీడా ప్రాంగణం
- కొమ్ము డ్యాన్సులో పాల్గొన్న జిల్లా అధికారి షాన్‌మోహన్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్(కాకినాడ)/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్ వేదికగా 2024-25 ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలోని 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 44 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నడుమ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విచ్చేయగా కలెక్టర్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లు ఎగరవేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించినందుకు సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లా క్రీడా మైదానాన్ని జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించే విధంగా అత్యుత్తమంగా అభివృద్ధి చేశామన్నారు. టోర్నీకి విచ్చేసిన క్రీడాకారులందరికీ స్వాగతం పలుకుతూ క్రీడా స్ఫూర్తితో ఈవెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. క్రీడాకారులు తమ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలు, బీచ్‌ను సందర్శించాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వహణకు స్పాన్సర్ చేసిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మరో ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి పెద్దఎత్తున క్రీడాకారులు విచ్చేసి ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025లో మ్యాచ్-1లో హరియాణా జట్టు 14-0 తేడాతో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందగా మ్యాచ్-2లో పాండిచ్చేరి జట్టు 10-1 తేడాతో కర్నాటక జట్టుపై విజయం సాధించింది.

అతిథులకు సత్కారం

టోర్నమెంట్‌కు అతిథులుగా విచ్చేసిన అర్జున అవార్డు గ్రహీతలు మహ్మద్ రియాజ్, ముకేష్ కుమార్‌లను కలెక్టర్ సత్కరించారు. ఇటీవల జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో బంగారుపతకం సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారిణి ఎస్కే



కళాకారుడి ప్రదర్శన

యాసిన్‌ను, కోచ్ సురేష్‌లను సన్మానించారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర స్పాన్సర్ చేసిన రూ.25వేలు చెక్కును యాసిన్‌కు అందజేశారు. అనంతరం స్పాన్సర్‌లైన కాకినాడ సీపోర్టు లిమిటెడ్, ఓఎన్‌జీసీ, అపోలో ఆసుపత్రి, నెక్కంటి సీఫుడ్స్, పట్టాభి ఇండస్ట్రీస్, లలితా ఇండస్ట్రీస్, శ్రీసత్య స్కాన్, ఆదిత్య యూనివర్శిటీ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, టైకీ ఇండస్ట్రీస్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.



పాట పాడుతున్న కళాకారుడు



కర్రసాము ప్రదర్శిస్తున్న కళాకారులు

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

తొలుత ముఖ్యఅతిథులు, అతిథులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి జాతీయ జెండాను జేసీ రాహుల్‌మీనా, ఆలిండియా హాకీ టోర్నమెంట్ జెండాను అసిస్టెంట్ కలెక్టర్ భావన, రాష్ట్ర జెండాను డీఆర్వో వెంకట్రావు ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోటీల అనంతరం క్రీడా మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. చింతూరు గిరిజన కళాకారులు నిర్వహించిన సాంప్రదాయ నృత్యం కొమ్ము డ్యాన్సులో కలెక్టర్, ఎస్పీ పాల్గొని కొమ్మును ధరించారు. వైజాగ్ బల్దేవ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థల విద్యార్థులు నిర్వహించిన కర్రసాము ఆకట్టుకుంది. కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వహించిన రాక్ బ్యాండ్ ఉర్రూతలూగించింది. విశాఖపట్నానికి చెందిన కోచ్ బాల్‌దేవ్ ఆధ్వర్యంలో 23 మంది ప్రదర్శించిన కర్రసాము అందరినీ ఆకట్టుకుంది.

నిర్వహణకు రూ.2 కోట్లు

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ నిర్వహణకు సుమారు రూ.2 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. కొంత ప్రభుత్వం సమకూర్చగా, మిగిలిన నిధులు వివిధ పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్లు సమకూర్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు దాదాపు వెయ్యిమంది క్రీడాకారులకు టీ, టిఫెన్, భోజనాలు అందించేందుకు జిల్లా క్రీడామైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



కొమ్ము ధరించిన ఎస్పీ బిందు మాధవ్

తలపడే జట్లు ఇవే..

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియేట్, గుజరాత్ సెక్రటేరియట్, ఆర్‌ఎస్‌బీ అహ్మదాబాద్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, సిమ్లా, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా, పాండిచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నుంచి టీమ్‌లు తలపడనున్నాయి.



హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో ప్రేరణ



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ ఏపీలో తొలిసారిగా ఆతిథ్య ఇవ్వడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి, ప్రేరణ కలిగించినట్టు అవుతుంది. నిత్యం ఉద్యోగాల్లో బిజీగా ఉండే అధికారులు, సిబ్బందికి ఇటువంటి టోర్నీలు మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయి. ఆలిండియా స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో ఏజీఎస్, ఇన్‌కంటాక్స్ తదితర శాఖల భాగస్వామ్యంతో హాకీ టోర్నీమెంట్లు జరిగేవి. తొలిసారిగా ఏపీలో జరుగుతోన్న టోర్నీలో ప్రభుత్వ భాగస్వామ్యంగా ఉండడం క్రీడలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. కాకినాడలో 4-5 ఏళ్ల కిందట ఒకసారి మహిళల టోర్నీకి వచ్చాను. కాకినాడ కాజా నచ్చింది.

-ముకేష్ కుమార్, అర్జున అవార్డు గ్రహీత.

క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

క్రీడల పట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తారు. నాణ్యమైన తరీదునిచ్చే కోచ్‌లను నియమించాలి. టోర్నమెంట్స్ నిర్వహించడం వల్ల నిత్యం విధినిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది. నేను 1996, 2000లో వేసవి ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాను. 1998లో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డును బహూకరించింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహించడంతో భవిష్యత్తులో హాకీ పట్ల విద్యార్థులు, యువతకు మరింత మక్కువ కలుగుతుంది. ఇక్కడి క్రీడా మైదానంలో సౌకర్యాలు అంతర్జాతీయ క్రీడా మైదానానికి దీటుగా ఉన్నాయి.

-మహమ్మద్ రియాజ్, అర్జున అవార్డు గ్రహీత.

హైదరాబాద్ నుంచి వచ్చి పురుగుమందు తాగి..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వపురానికి చెందిన ఇ.నాగలక్ష్మీ దుర్గ(28) తన భర్త ముగ్గురు పిల్లలతో కలిసి తెలంగాణలోని శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అయితే స్త్రీ సంబంధిత ఆరోగ్య సమ్యలవల్ల ఆమె బాధపడుతూ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ్నానికి పాల్పడింది. రాజమహేంద్రవరంలోని తెలిసిన వ్యక్తి సూచనతో వైద్యానికి ఇక్కడికి వచ్చారు. హైవేలోని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో
లారీ డ్రైవర్ మృతి

● మృతుడు పంగిడివాసిగా గుర్తింపు



మృతిచెందిన లారీ డ్రైవర్ రామకృష్ణ

మండపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి పంచాయతీపరిధిలో గల వేములపల్లిలో విద్యుదాఘాతానికిగురై లారీ డ్రైవర్ శనివారం అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం పంగిడికి చెందిన చిటికెన రామకృష్ణ(52)లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు వేములపల్లిలో వున్న బ్రాన్ అయిల్ ఫ్యాక్టరీలో అయిల్‌లోడ్‌ను తీసు కువెళ్లేందుకు వచ్చి శనివారం ట్యాంకర్‌ను ఫ్యాక్టరీ బయట ఉంచి శుభ్రం చేసుకునేందుకు లారీపైకి ఎక్కిన డ్రైవర్ రామకృష్ణకు సమీపంలో ఉన్న 33, 11కె.వి. విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురికావటంతో లారీపైనుంచి కింద పడిపోయి అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండపేట రూరల్ సీ.ఐ. దొర్రాజు, ఎస్ఐ బుజ్జిబాబు లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిటికెన శ్రీరామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీ.ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఎక్కుతూ జారిపడి యువకుడి మృతి



వాకాడ జాన్‌బాబు

సామర్లకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సామర్లకోట నుంచి నూజివీడు వెళ్లేందుకు తన తండ్రి, భార్య, కుమారుడితో వెళ్లేందుకు శనివారం రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ కిందికి జారిపడడం, అదే సమయంలో రైలు బయలుదేరడంతో ఆ రైలు కింద పడి తీవ్రగాయాలతో కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకు చెందిన వాకాడ జాన్‌బాబు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. చెంతనే ఉన్న జాన్‌బాబు కుటుంబ సభ్యులు నిశ్చే ష్టులై రోధించారు. సామర్లకోట రైల్వే పోలీ సులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ఆలయం తిరువీధులలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల లో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భీమేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు చర్చిస్తున్న అధికారులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను శనివారం దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమి షనర్, ఉపకమిషనర్, జిల్లా దేవదాయశాఖ అధికారితో కలసి పరిశీలించారు. ఆలయంలో ముందు గా దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషన ర్ కె.సుబ్బారావు, ఉపకమీషనర్, శివరాత్రి ఉత్సవ అధికారి డి.ఎల్.వి.రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తుల దర్శనానికి క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు, సప్తగోదావరిలో పుణ్యస్నానాలు, అభిషేకాలు నిర్వహణ ఇతర భద్రతా ఏర్పాట్లుపై చర్చించి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉపకార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయలో హుండీల ఆదాయం లెక్కింపు

● రూ.11.61లక్షల ఆదాయం

పిఠాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శనివారం తెరిచారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికాఅమ్మవార్ల సన్నిధిలో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ. 11,61,650 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్ర కుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, బ్యాంకు, ఆలయ సిబ్బం ది పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలోని ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

టార్క్-2025 టెక్నికల్ సింపోజియం

» మార్చి 15, 16 తేదీల్లో జాతీయస్థాయిలో నిర్వహణ

» పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ మురళీకృష్ణ



టార్క్ టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని సమావేశహాల్లో యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, స్టూడెంట్ చాప్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15, 16 తేదీల్లో నిర్వహించనున్న టార్క్-2025 టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను వర్శిటీ ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ సింపోజియంలో బాగంగా బ్రిడ్జ్ బిల్డింగ్, లేత్ మాస్టర్, వర్క్‌షాప్స్, రోబోరేస్, డిజైన్ ఫ్రీక్, చెస్ మోనార్క్, మెకానికల్ క్విజ్, మెక్ ఓమేనియా, స్లైడ్‌ప్లెయి న్, ప్రాజెక్టు ఎక్స్‌పో, కాస్టింగ్ క్రౌన్, ఇంజన్ మాంటేజ్ వివిధ పోటీలు నిర్వహించనున్నారన్నారు. అంతేకాకుండా దీని ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్, సాంకేతిక అంశాలపై పట్టు సాధించడం, ప్రజంటేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. అనంతరం సింపోజియం కన్వీనర్ డాక్టర్ డి.లింగరాజు మాట్లాడుతూ వర్శిటీ, అనుబంధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఫెస్ట్‌లో పాల్గొని నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వినూత్న ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల పనితీరుపై నిఘా

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడానికి వైద్యుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ టి.రమేష్‌కిశోర్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి, డీహెచ్ఎస్ కార్యాలయాన్ని శనివారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఇటీవల ప్రజల్లో సదరం సర్టిఫికెట్లు తొలగిస్తున్నామని అపోహలు ఉన్నాయన్నారు. దీనివల్ల అర్హులకు ఇబ్బంది ఉండదన్నారు. ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని ఏరివేస్తామన్నారు. మరో వారంలో సర్వే పూర్తవుతుందన్నారు. తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా డాక్టర్ల పనితీరును పరిశీలిస్తామన్నారు. రాత్రి డ్యూటీల్లో డాక్టర్లపై ప్రత్యేకనిఘా పెట్టామన్నారు. దీనిలోభాగంగా గతనెల రోజుల్లో 50 మంది వైద్యులకు పనితీరు మార్చుకోవాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి ఓపీ కౌంటర్లు, ఆపరేషన్ థియేటర్లు, పేషెంట్లు ఉండే వార్డుల్లో క్యూఆర్ కోడ్ పెట్టామన్నారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 6 ప్రశ్నలు వస్తాయి. వీటి ద్వారా ఆసుపత్రిలో వైద్యుల పనితీరు, మందుల కొరత, లాబ్ టెస్టులు, నర్సుల ప్రవర్తన తదితర వివరాలు రోగుల నుంచి తెలుసుకుంటామన్నారు.స్పెషలిస్టు డాక్టర్ల రిక్రూట్‌మెంట్ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 297 డాక్టర్ పోస్టులకు 2600 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో ఆలస్యమైందన్నారు. మార్చి నెలాఖరు నాటికి స్పెషలిస్టు డాక్టర్ల భర్తీ జరుగుతుందన్నారు. పదోన్నతులు ఇస్తామన్నారు. ప్రతిరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించిన అబా ఐడి క్రియేట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి పేషెంటుకు రూ20లు ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తుందన్నారు. గత రెండు నెలలుగా పేషెంటు ఈహెచ్ఆర్‌లు స్కాన్ చేసి అబా ఐడి క్రియేట్ చేయడంలో తుని ఆసుపత్రికి సుమారు రూ.2లక్షల వరకు సొమ్ము జమైందన్నారు. అబా ఐడి క్రియేట్ చేయడానికి స్థానికంగా ఇద్దరు వ్యక్తులను రూ.8 వేలు గౌరవ వేతనం ఇచ్చి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో ఆసుపత్రికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. 26 జిల్లాల డీసీహెచ్ఎస్‌లకు ఫైర్ వాహనాలు తీసుకోవడానికి అనుమతులిచ్చామన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీలకు సంబంధించి సమస్య పరిష్కారానికి న్యూ టెండర్లకు వెళ్లామన్నారు. అత్యవసర మందుల కొరత ఉంటే గుర్తించి ఆరోగ్యశ్రీ నిధులు, హెడీఎస్‌లో నిధులు ఉపయోగించి ఆసుపత్రి సూపరింటెండెంట్లు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్.పద్మశ్రీరాణి, ఏడీ టి.విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్ల పరిశీలన

మోతుగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిం తూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో సీలేరు నది ఒడ్డున ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన్ బయర్, చింతూరు తహసీల్దార్ చిరంజీవి సందర్శించారు. అనంతరం ఒడిశా మన్యం కొండ జాతర కమిటీ సభ్యులతో చర్చించారు. అవతల ఒడ్డు నుంచి ఇవ తల ఒడ్డుకు నీటిలో పడవపై ప్రయాణించే భక్తుల కు తగు జాగ్రత్తలు, జలపాతంవద్ద జాతర జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ భారీ కేడ్‌లు ఏర్పాటుచేయాలని పార్కింగ్ స్థలం కూడా దూరం గా ఉంచాలని ఇరురాష్ట్రాల అధికారులకు సూచించా రు. పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌కి సూచించారు. అక్కడి నుంచి ఇరురాష్ట్రాల అధికారులు సీలేరు నదిపై ఏర్పాటుచేసే ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాట్లు చేసే ప్రదేశాన్ని స్వయంగా బోటుపై వెళ్లి పరిశీలించారు. అక్కడి సమస్యలు గురించి లక్కవరం ఫారెస్ట్ రేంజర్ నానాజీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి, చింతూరు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీలేరునదిలో ఫ్లోటింగ్ బ్రిడ్జిప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు

కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన ఏడుగురిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడి పారిపోతూ కానిస్టేబుల్‌ను స్కార్పియోతో ఢీకొట్టి గాయపర్చిన ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. యర్రవరం గ్రామంలో దొంగతనం చేసి స్కార్పియో వాహనంలో విజయవాడవైపు పారిపోతున్నారని సమాచారం రావడంతో పోలీసులు కొవ్వూరు గా మన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో ఎన్‌హెచ్ 16 వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి.రాంబాబు, హెచ్‌సీ ఎం.లక్ష్మీనారాయణలకు సమాచారం అందించారు. దీంతో టోల్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా ఢీకొట్టడంతో రాంబాబు కింద పడిపోయాడు. గాయాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు

● చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్‌కి ఉత్తర్వులు



డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం వచ్చిన నాటి నుంచీ ఆరోపణలు మూటగట్టుకున్న ఆయనకు జిల్లానుంచి ఉద్వాసన పలికారు. గతేడాది డిసెంబరు 24న దేవీచౌక్‌లోని స్వాతీ టీస్టాల్‌లో పని చేస్తున్న యువకుడిని ఆయన కొట్టుకుంటూ జీపులో ఎక్కించుకెళ్లారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలు ఇటీవల బయటికి వచ్చాయి. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తిపై పోలీసు దాష్టీకాన్ని జనం ఖండించారు. ఈ విషయం ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి చేరింది. అమానవీయ ప్రవర్తనపై ఉక్కుపాదం మోపే ఎస్పీ.. సదరు డీఎస్పీపై అంతర్గత విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీంతో ఆయనను తక్షణమే ఇక్కడి విధుల నుంచి తప్పిస్తూ డీజీపీ కార్యాలయంలోని ఏడీజీపీ(శాంతి భద్రతలు) వద్ద రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా ఎస్పీని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాగా.. కొద్దిరోజుల క్రితం డీఎస్పీ వెంకటేశ్వర్లు గుణదల ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. ఆయనపై చర్యలు తప్పవనే ఉద్దేశంతో అక్కడి విధుల అనంతరం విజయవాడలో బందోబస్తుకు పంపించేశారని అంటున్నారు. గతంలో ఆ డీఎస్పీ ఓ మహిళా కానిస్టేబుల్‌ని లైంగికంగా వేధించడంపై అప్పట్లోనే ఎస్పీ సీరియస్ అయ్యారు. ఆ ఘటనలో ఇంకెప్పుడూ ఆమె జోలికి వెళ్లనంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్టాంపు పేపర్‌పై రాసిచ్చారు. ఇది పోలీసు అధికారులకు తప్పుడు మెస్సేజ్ పంపిస్తుందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లోనే ఆ డీఎస్పీపై సస్పెన్షన్ వేటు పడాల్సి ఉండగా 'మేనేజ్' చేసుకున్నారనే విమర్శలు వినిపించాయి. అప్పటి నుంచీ ఆయనను స్థాని క విధులకు దూరం పెడుతూ వచ్చారు. తర్వాత తన వద్ద పనిచేసే హోంగార్డును ఇష్టానుసారం తిట్టడంతో అతడు ఆత్మహత్య చేసుకుంటా నంటూ ఆవేదన చెందారు. ఇలా తరచూ డీఎస్పీపై ఆరోపణ లు వస్తుండడంతో కీలకమైన విధులకు దూరంగా ఉంచారు. అయితే, ఓ సాధారణ యువకుడిని పబ్లిక్‌లో కొట్టుకుంటూ తీసుకెళ్లడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఆయన సిఫారసుతో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిం చారు. కాగా నాణేనికి మరోవైపు ఇంకొక విధంగా గుసగుసలు వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం డీఎస్పీగా రావడానికి అంబికా ప్రసాద్ ప్రయత్ని స్తున్నారని, ఆయన సొంత బంధువైన ఓ హెడ్ కానిస్టేబుల్‌తో డీఎస్పీ వెంకటేశ్వర్లు సీసీ కెమెరా ఫుటేజీ తీయించి సోషల్ మీడియాలో వైరల్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అంబికా ప్రసాద్ వైసీపీ వీర విధేయుడిగా పేరుబడడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆయన వీఆర్‌లోనే ఉన్నారు. ఈ అంత ర్గత రాజకీయాలవల్ల ప్రజలకు రక్షణ కల్పించాల్సిన విధుల్లో ఉండి యూనిఫాం పరువు బజారుకు ఈడుస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

తాకట్టు బంగారం తారుమారు

● రూ. కోటి విలువైన బంగారం మాయం ● క్యూ కడుతున్న ఖాతాదారులు

తునిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తేటగుంటలో గుర్తింపు పొందిన కెనరా బ్యాంక్ కుదవపెట్టిన బంగారానికి భద్రత లేకుండాపోయింది. ఇంటి దొంగల పనితో కోటి విలువైన బంగారు ఆభరణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. బంగారంపై అప్పులకు సంబంధించి అదే బ్యాంకులో 3500 ఖాతాలు ఉండగా వీటిలో 150కి పైబడి ఖాతాల్లో కోటి విలువగల కొన్ని ఆభరణాలు కానరాకుండా పోవడంపై ఖాతాదారులు ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు బ్యాంకులో విచారణ చేపట్టి అవకతవకలకు బాధ్యులుగా ఉన్న బ్యాంక్ మేనేజర్‌తోపాటుగా మరో ఇద్దరు బ్యాంకు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ప్రస్తుత ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ తెలుపుతున్నారు. బ్యాంక్ ఖాతాదారులు ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని, తమ నగలకు పూర్తి భరోసా ఇస్తామని హామీ ఇస్తూ రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు ఖాతాదారులు తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో మ్యారేజ్ సర్టిఫికెట్



పాతయింజరం సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలులోకి తెచ్చింది. దీంతో లబ్ధిదారులు ఇంటి వద్ద నుంచే సేవలు పొందే అవకాశం లభించింది. వివరాలను తమ మొబైల్ వాట్సాప్ ద్వారా సంబంధిత కార్యాలయానికి మెస్సేజ్ చేరవేస్తారు. అక్కడి సిబ్బంది పరిశీలించి అదేరోజు లబ్ధిదారుడి మొబైల్‌కు మెస్సేజ్ పెడతారు. తాజాగా పాతయింజరం సచివాలయంలో ఈవిధానంలో మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. నూతన జంట ఎం.దుర్గాదేవి, ఆర్.దుర్గారావు వాట్సాప్ గవర్నస్ ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పోతుల సూర్య అదేరోజు వారికి మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ విధానం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్‌లో పులవర్తి శోభ(72) తన భర్త పాలేశ్వరరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలోని ఎండుటాకులు, చెత్తా చెదారాన్ని ఆమె తరచుగా పోగేసి అగ్గి పెడతారు. ఈ క్రమంలో శనివారం మంట వేసి ప్రమాదవశాత్తూ ఆ మంటలో పడి కాలిన గాయాలుకావడంతో ఆస్పత్రికి తరలించారని.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని
వృద్ధుడి మృతి



కొవ్వూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో 55నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. అతని ఒంటిపై లైట్ నీలంరంగు చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి, కుడిచేతి వేలుకి ఏసు ప్రభువు బొమ్మ ఉంగరం ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించి ఆచూకీ తెలిసిన వారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ 9440796622, 08813- 231100, 9154875583కు సమాచారం తెలపాలన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

కరప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంధువుల వివాహ కార్యక్రమానికి వచ్చిన ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగరంజిల్లా డెంకాడ మండలం పెదతాడివాడ గ్రా మానికి చెందిన వెలమల నాగమణి శుక్రవారం రాత్రి కాకినాడజిల్లా కరప మండలం నడకుదురు వెలమ సంక్షేమ సంఘ భవనంలో జరుగుతున్న బంధువు బొంగు నాగభూషణరావు వివాహానికి హాజరయ్యారు. విందు అనంతరం రాత్రి 11గంటల సమయంలో పెండ్లికుమారుడు ఇంటికి వెళ్లడానికి తల్లితోకలిసి రోడ్డు దాటుతున్నారు. ముఖానికి మాస్క్ ధరించిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని 50 గ్రాముల స్టెప్‌చైన్‌ను లాక్కుని వేగంగా వెళ్లిపోయాడు. స్థానికులు, బంధువులు వెంబడించినా చైన్ స్నాచర్ తప్పించుకుని పారిపోయాడు. దీనిపై బాధితురాలు కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రావులపాలెం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరుజిల్లా కొయ్యలగూడెం సమీపంలోని డిప్పకాయలపాడుకు చెందిన మద్దూరి శివన్నారాయణ శనివారం మధ్యాహ్నం లక్ష్మీపోలవరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి సమీపంలోని అరటితోటల్లోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్‌పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు 108లో శివన్నారాయణను ముందు కొత్తపేట, అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల గొడవల కారణంగా ఇలాచేసి ఉండవచ్చునని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌ను కలిసిన సర్పంచ్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15: (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రకుమార్‌ను శనివారం తిమ్మాపురం గ్రామ సర్పంచ్, జేఎన్టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

సెలవు దినాల్లో రైతుల నమోదు ప్రక్రియ

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్



చేబ్రోలులో పరిశీలిస్తున్న విజయకుమార్

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భూములు కలిగిన రైతులు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను సెలవు దినాల్లో నిర్వహిస్తామని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటారని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, ఏకేమల్లవరం గ్రామాల్లో రైతుల విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను ఆయన శనివారం తనిఖీ చేశారు. జిల్లాలో స్వంత భూమి కలిగిన రైతులు 1.34లక్షల మంది ఉండగా కేవలం 61వేల మంది మాత్రమే ఇప్పటి వరకూ తమ వివరాలు నమోదు చేయించుకున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాకు మ్మడిగా పీఎం కిసాన్, పంటల భీమా, పంట నష్టం, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాలు తదితర పథకాలల వర్తించేలా 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్న ప్రతి రైతుకు వస్తుందని వివరించారు. రైతులు సేవా కేంద్రాలకు వచ్చి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులున్నారు.

యండమూరులో కొనసాగుతున్న పోలీస్ పికెట్



పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

కరప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యండమూరు గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. గ్రామంలోని ఇరు సామాజికవర్గాల నడుమ కొట్లాట, దాడి నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గడిచిన 48గంటలగా పహారా కాస్తున్నారు. కాకినాడలో ఐటీఐ చదువుతున్న కురుపూడి ఈశ్వరప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన మారెళ్ల అజయ్ అనే యువకుడు ఈనెల 13వ తేదీన కోడికత్తితో విచక్షణారహితంగా పొడిచి పరారయ్యాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఈశ్వరప్రసాద్ ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెండు సామాజికవర్గాల మధ్య జరిగిన ఈ ఘటనతో ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ శుక్రవారం రాత్రి గ్రామస్తులతో సమావేశమై ఆయా వీధులకు పీస్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా అందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా వీధుల పెద్దలతో పీస్ కమిటీలను ఏర్పాటుచేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సూచించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌ఐలు తోట సునీత, ఆర్‌వీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితుడికి రిమాండ్

కురుపూడి ఈశ్వరప్రసాద్‌పై కోడికత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన నిందితుడు మారెళ్ల అజయ్‌ను శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించారని ఎస్‌ఐ చెప్పారు. దాడిలో నిందితుడు అజయ్‌కు సహకరించిన అతడి స్నేహితుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

రూ.4,44,291 ఆదాయం





విశేష పుష్పాలంకరణలో స్వామివారు, దర్శనానికి క్యూలో భక్తులు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి గ్రామంలో స్వయంభుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయంలో మాఘమాసం పురస్కరించుకుని ఆలయ ఆవరణలో వేలాది భక్తజనంతో శనివారం కిక్కిరిసింది. తెల్లవారు జామున 3గంటల నుంచే భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణలో అన్ని క్యూలైన్లు భక్తజనంతో నిండిపోయాయి. వారికి ఏ అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఈవో చెప్పారు. ప్రత్యేక దర్శనాల టిక్కట్ల విక్రయాల ద్వారా రూ.3,09,800.. నిత్యాన్నదాన పథకానికి విరాళా ల ద్వారా రూ.92,926, కేశఖండనల టిక్కట్ల విక్రయాల ద్వారా 7,400, తులాభారం ద్వారా రూ.550, లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.33,615 వెరసి రూ.4,44,291 ఆదాయం లభించినట్టు ఈవో చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు చేశారు.

నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలంలోని కుయ్యేరు జడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన క్లస్టర్స్ అధికారిక సమావేశంలో కోలంక ఎంపీపీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నున్న బోయిన గణేష్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులకు ఓటు వేయాలని ప్రచారం చేయడం దుమారం రేపింది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా రాఘవులకు బ్యాలెట్ పేపర్‌లోని సీరియల్ నంబర్ 14లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేశారు. సమావేశం అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులను ఆపి హెచ్చరికలు జారీ చేయడం, కౌంటింగ్ రోజున ఓట్ల వివరాలు పరిశీలిస్తామని, అభ్యర్థికి ఓట్లు సరిగా రాకపోతే జిల్లా విద్యాశాఖ ద్వారా అనేక ఇబ్బందులు కల్పిస్తామని బెదిరింపులకు గురి చేయడం కలకలం రేపింది. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి రూల్స్‌ను అధిగమించి ఎన్నికల ప్రచారం చేసిన నున్నబోయిన గణేష్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు.

జడ్పీ సీఈవో పర్యటన

కొత్తపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామంలో శనివారం జడ్పీ సీఈవో లక్ష్మణరావు ఆకస్మికంగా పర్యటించారు. ప్రతీ గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు, అందులో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను అమలు చేస్తున్నందున ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పంచాయతీ అధికారులతో కలిసి చెత్త నుంచి సంపద తయారీ, తడిచెత్త పొడి చెత్త సేకరణ వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం మహిళలకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్‌డీ హరికృష్ణాసత్యారెడ్డి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15: (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన చేసుకోవడం ద్వారా నివారించవచ్చని ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రసోబ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక యూనో ఆసుపత్రిలో కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ బాల్య కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు.

సూర్యకిరణాలు తాకాయి!

కొత్తపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం మహాపర్వదినాలులో భాగంగా శనివారం ఉదయం సూర్యకిరణాలు కొత్తపల్లిలో వేణుగోపాలుడి పాదాలను తాకాయి.



చెత్తను వేరు చేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు

అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞలు



కాకినాడలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్



సామర్లకోట: ఇంటింటా డస్ట్‌బిన్లు అందిస్తున్న డీపీవో

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పొడి, తడి చెత్త, వ్యర్థాల నిర్వాహణలో మూలాల విభజన అంశంతో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కాకినాడ నగరానికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. చెత్తను వేరు చేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినదించారు. ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని శనివారం కాకినాడ శారదమ్మ గుడి సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వాహణ, వాటిని వేర్వేరు చేసి వాటి ద్వారా ఏమేమి ఉత్పత్తి చేయవచ్చు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారుచేయవచ్చని, అలాగే మిథేన్‌ను తయారుచేయవచ్చని అది సీఎన్‌జీ గ్యాస్ మాదిరి వినియోగించుకోవచ్చన్నారు. కాకినాడలో 50 డివిజన్లలో ఉదయం నుంచి చెత్త సేకరణ, వినియోగంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ వరకు జరిగిన స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఈ కామేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వీచరణ్, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ, ఆర్వో శిరీష్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎంజివి వర్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించారు.

పరిశుభ్రతతో సమాజం మెరుగు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతో సమాజం మెరుగుపడి ఆరోగ్యకరంగా తయారవుతుందని డీఎంహెచ్‌ఓ డా.జెనరసింహ నాయక్ ఆకాంక్షించారు. స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆయన వైద్యఆరోగ్యశాఖ సిబ్బందితో కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రాల్లో పారిశుధ్యం.. అలాగే ఫ్రై డే, డ్రై డే కార్యక్రమం ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌టీవో డా.ఆర్.రమేష్, డీఐవో డా.కెవి సుబ్బరాజు, ఆర్‌బీఎస్‌కె పీవో డా.ఐ ప్రభాకర్, ఇన్‌చార్జ్ డీపీఎంవో డా.సురేఖ, ఇన్‌చార్జ్ డీఎంవో డా.రవికుమార్, ఏవో దేవకుమారి, డెమో ప్రసాద్‌రాజు, ఎస్‌వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో పరిశుభ్రత, అహ్లాదకరమైన వాతావరణం నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటిండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి అన్నారు. స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమం కింద జీజీహెచ్ ప్రాంగణాన్ని సూపరిండెంట్ ఆధ్వర్యంలో శుభ్రపర్చారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ సూపరిండెంట్ డా.పిశ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ శీధర్, డా.యమున, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: పరిసరాలను పరిశుభ్రంతో ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి పేర్కొన్నారు. తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రాంగణంలో చెత్తా,వ్యర్థాలను తొలగించారు. ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతశ్రీ, ఎన్ఎస్ఎస్ అధికారి హరిబాబు, డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ గోపి, హేమలత పాల్గొన్నారు.

పిఠాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రిన్సిపాల్ ఏ.మురళీ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.రేవతి, ట్రైనర్ వి.వీరబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటా చెత్త సేకరణలో అప్రమత్తంగా ఉంటున్నామని, ఆయా కేటగిరీలకు ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు కేటాయించినట్టు పిఠాపురం మున్సిపల్ కమిషనరు నామా కనకారావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. మున్సిపల్, వార్డు సచివాలయ, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సామర్లకోట: పనసపాడు గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ హాజరయ్యారు. పచ్చదనం పరిశుభ్రం, తడిచెత్త పొడిచెత్త సేకరణ అంశాలపై ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీవో పరిశీలించి తగు సూచనలు చేశారు. డీపీవో కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి నిమ్మకాయల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి ఎన్.ముసలయ్య పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సామర్లకోట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయం, వాటర్ ట్యాంకుల వద్ద నిర్వహించారు. కమిషనర్ శ్రీవిద్య ముఖ్య అతిథిగా హాజరై పరిసరాల పరి శుభ్రత వంటి అంశాలపై సిబ్బందికి వివరించారు.

గొల్లప్రోలు: వీధులు, డ్రెయిన్లల్లో చెత్తాచెదారం వేయవద్దని గొల్లప్రోలు కమిషనరు కనకారావు సూచించారు. పట్టణంలో అవగాహనా సదస్సులు జరిపి ర్యాలీలు నిర్వహించారు. చెత్తను వీధుల్లోకి వచ్చే నగరపంచాయతీ చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ రఘు పాల్గొన్నారు.

కరప: నడకుదురులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సర్పంచ్ డేగల లలితకుమారి, కాకినాడ డీఎల్‌పీవో అన్నామణి, ఎంపీ డీవో మట్టపర్తి అనుపమ, ఈవోపీఆర్డీ సలాది వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వారిజ పాల్గొన్నారు.



జీజీహెచ్: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డా.నాయక్



పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తులను గెలిపించాలి

కూటమి నాయకుల ప్రచారం



కాకినాడలో కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొండబాబు

జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. గొల్లప్రోలులో పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం చేశారు.


కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో డివిజన్‌లోని పట్టభద్రుల ఓటర్లు శనివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. రాజశేఖర్‌ను గెలిపించాలనే కరపత్రాలను ఆవిష్కరించి పట్టభద్రుల ఓటర్లకు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకుడు గోడి వెంకట్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రుల ఓటర్లు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని వర్మ అతిథిగృహం వద్ద టీడీపీ నాయకులు, మండలంలోని ప్రచార ఇన్‌చార్జిలతో శనివారం రాత్రి సమావేశం నిర్వహించి ప్రతి ఓటరును కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరించి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరాలన్నారు. టీడీ పీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రు డు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ ఉన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని

సామర్లకోట: పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జీ.మేడపాడులో విస్తృత ప్రచారం నిర్వహించారు. కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాసుల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను స్వయంగా కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు పాలకుర్తి వీర భవన్నారాయణ(రవిబాబు), మార్ని వీర భద్రరావు, జానా వెంకట్రావు పాల్గొన్నారు.

కరప: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కరప, వేములవాడ, వాకాడ, కూరాడ, వేళంగి గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, జనసేన, టీడీపీ మండలాధ్యక్షులు బండారు మురళి, దేవు వెంకన్న, కొటికలపూడి దుర్గారావు, గీసాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు: టీడీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యేలు

మీసాల వెంకన్న ఆలయంలో భారీ అన్నదానం

కరప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏడు ఊర్ల వెంకన్నగా వినుతికెక్కిన యండమూరు మీసాల వెంకన్న ఆలయంలో శనివారం భారీ అన్నదానం జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నసంతర్పణలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ సర్పంచ్ నులుకుర్తి వీరన్న, మాజీ ఎంపీటీసీ పలివెల జానకిరామయ్య, దేవాదాయశాఖాధికారులు ఉన్నారు.

మార్కెట్‌లోకి సుజుకి న్యూ యాక్సెస్ 125 సీసీ స్కూటర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంటిపూడి సుజుకి భానుగుడి జంక్షన్ షోరూమ్‌లో సుజుకి న్యూ యాక్సెస్ 125 సీసీ స్కూటర్‌ను శనివారం సుజుకి ఏరియా మేనేజర్ బాలకృష్ణ, జీఎం రాజారావు చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. రాజారావు మాట్లాడుతూ టూ వీలర్ విక్రయ రంగంలో సుజుకి వాహనానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. ఈ స్కూటీ అన్ని వర్గాలతో పాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని, డ్రైవింగ్‌కు సులువైందన్నారు. సుజుకి ఏరియా మేనేజర్ బాలకృష్ణ, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అల్లు అరవింద్ సతీమణి పూజలు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ సతీమణి నిర్మల శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పండితులు, ఆసాదులచే సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు.



అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

సప్తాహ మహోత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే సప్తాహ మహోత్సవాల ఏర్పాట్లకు శనివారం శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా 168గంటల పాటు నిరంతరాయంగా నిర్వహించే భజన కార్యక్రమాలకు సంబంధించిన ఈ ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ, కడారి తమ్మయ్య నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగర పంచాయతీ మాజీ చైర్‌పర్సన్ శీరం మాణిక్యం, ఏఎంసీ మాజీ చైర్మన్లు మొగలి బాబ్జీ, తెడ్లపు చిన్నారావు, బస్వా చిట్టిబాబు, మొగలి రామ్మూర్తి, రాజన్ననాయుడు, మొగలి అయ్యారావు, గొల్లపూడి కృష్ణారావు, కీర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మూర్తికి నివాళి

పిఠాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చైర్‌పర్సన్‌గా పట్టణాభివృద్ధికి, వైద్యుడిగా నిరుపేదలకు డాక్టర్ ఎస్ఎస్ఆర్ మూర్తి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో గల రైస్‌మిల్లర్స్ కల్యాణమండపంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంస్మరణ సభ శనివారం జరిగింది. ఏలూరు మాజీ డీపీవో టిఎస్ విశ్వనాథ్, డాక్టర్ శీరం రవి, శీరం ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మూర్తితో తమకు ఉన్న అనుబంధాన్ని పలువురు వివరించారు.

23న ఒలింపియాడ్ పరీక్ష

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కాకినాడ కరణంగారి సెంటర్ లోని ఎంఎస్ఎన్ పాఠశాల ప్రాంగణంలో భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్ పరీక్ష నిర్వహిస్తున్నామని ఎంఎస్ఎన్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగిని తెలిపారు. 2 కేటగిరీలుగా ఈ పరీక్ష జరుగనుందని, 13 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు ఏ కేటగిరి, 15 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులకు బీ కేటగిరీగా పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20లోపు తమ పేర్లు 98857 76555 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగస్ఫూర్తిని పిల్లల్లో నింపాలనే ఉద్దేశ్యంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

సామర్లకోటలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గోదావరి ఒడ్డున వేంచేసిఉన్న మాండవ్యనారాయణస్వామి ఆలయంలో మాఘమాసం మహాపర్వదినాల సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల రఘు ఆచార్యులు తదితర పండితులచే దాతలు పద్మరాజుచౌదరి దంపతుల సౌజన్యంతో అందజేసిన నారాయణ స్వామి,శ్రీదేవి, భూదేవి విగ్రహాలకు హోమ, విశ్వక్షేన, శాంతి కర కల్యాణ పూజలు నిర్వహించారు. అనం తరం మహాన్నదానం జరిగింది. మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం దంపతులు, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులు, యండమూరి రఘు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణారావుపేట కృష్ణమూర్తివారి వీధిలో గల శ్రీశ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మూలమూర్తులకు విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో శనివారం నిర్వహించిన 18 అడుగుల శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అనపర్తి ఎన్డీఏ నాయకులు, పెదపూడి గ్రామ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

KTCB ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లి.నెం.సి.750

రామారావుపేట బ్రాంచ్, కాకినాడ, ఫోన్:0884-2378427

APPENDIX IV (Rule 80) స్థిరాస్థి కొరకు)

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ యన్‌ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 క్రింద ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, రామారావుపేట బ్రాంచ్, కాకినాడ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్మెంట్) రూల్స్ 2002 రూల్-2తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన రూ.43,84,096/-(అక్షరాల నలభై మూడు లక్షల ఎనభై నాలుగు వేల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) ది.13-11-2024 నుండి వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు. 1. **వీరవల్లి సుబ్బారావు** తండ్రి శేషయ్య, డోర్.నెం.3-16-1/21బి, రాజ్యలక్ష్మీనగర్, గొడారిగుంట, కాకినాడ. 2. వీరవల్లి శ్రీనివాసరావు, తండ్రి సుబ్బారావు, డోర్‌నెం.3-16-1/21బి, రాజ్యలక్ష్మీనగర్, గొడారిగుంట, కాకినాడ వారిని కోరుతూ ది.13-1102024న నోటీసు జారీ చేసినారు.

ఋణగ్రహీత సొమ్మును తిరిగి చెల్లించుటకు విఫలమైనందున ఋణగ్రహీతలకు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది. ఏమనగా సదరు రూల్స్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు తేది.13-02-2025న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనం తీసుకున్నారు. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.43,84,096/-** మొత్తానికి మరియు తేది.13-11-2024 నుండి వడ్డీ యితర ఖర్చులు ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, రామారావుపేట బ్రాంచ్, కాకినాడ వారి చార్జీలకు లోబడి వుంటాయి.

స్థిరాస్థి వివరం

1. డాక్యుమెంట్ నెం.2494/1997, కాకినాడ SRO, తేది 26-03-1997 పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, కాకినాడ మండలం, సూర్యారావుపేట శివారు గొడారిగుంట గ్రామం సర్వే నెం. 45/4సి గల పూరా AC1.42 cents స్థలములో ఎకరా 0.471/3 సెంట్ల స్థలము చిన్న చిన్న ప్లాట్లుగా విభజించబడి అందలి200 చ॥గ॥ గల ప్లాట్ నెం.2 కు దక్షిణం వైపు గల 100 చ॥గ॥ గల లేక 83.61 చ॥మీ॥ల స్థలమునకు కొలతలు మరియు హద్దులు.

తూర్పు	: 20'0' లేక 6.09 మీ॥	- ప్లాటు నెం.11
పడమర	: 20'0' లేక 6.09 మీ॥	- దారి మరియు రమణయ్యపేట కాలవగట్టు
ఉత్తరం	: 45'0' లేక 13.72 మీ॥	- ప్లాటు నెం.2
దక్షిణం	: 45'0' లేక 13.72 మీ॥	- కుంచె సత్యనారాయణ గారి స్థలం

2. డాక్యుమెంట్ నెం.4127/1998, కాకినాడ SRO, తేది: 14-05-1998 పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, కాకినాడ, మండలం, సూర్యారావుపేట శివారు, గొడారిగుంట గ్రామం, సర్వే నెం.45/4సి గల పూరా AC1-42 cents స్థలములో ఎకరా 0.47 1/3 సెంట్ల స్థలము చిన్న చిన్న ప్లాట్లుగా విభజించబడి అందలి 200 చ॥గ॥గల ప్లాట్ నెం.2 కు ఉత్తరం వైపు గల 100 చ॥గ॥ లేక 83.61 చ॥మీ॥ల స్థలమునకు హద్దులు మరియు కొలతలు.

తూర్పు	: 20'0' లేక 6.09 మీ॥	- ప్లాటు నెం.11
పడమర	: 20'0' లేక 6.09 మీ॥	- దారి మరియు రమణయ్యపేట కాలవగట్టు
ఉత్తరం	: 45'0' లేక 13.72 మీ॥	- ప్లాటు నెం.1
దక్షిణం	: 45'0' లేక 13.72 మీ॥	- ప్లాటు నెం.2 నందలి కొంత స్థలం

పై ఉదహరించిన రెండు డాక్యుమెంట్ల రీత్యా సంక్రమించిన 200 చ॥గ॥ స్థలము, భుక్త కొలత ప్రకారం 190.67 చ॥గ॥ స్థలమునందలి డోర్ నెం.3-16-1/21బి గల పెంకుటిల్లుతో పాటు యావత్తు యీజిమెంటరీ హక్కులతో సహ.

తేది: 13.02.2025 అధీకృత అధికారి

స్థలం: కాకినాడ ది.కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు లిమిటెడ్.

జగ్గంపేట ఆసుపత్రిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

జగ్గంపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా శనివారం జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆసుపత్రి పరిసరాలు శుభ్రపరిచారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

మోతుగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో మోతుగూడెంలో విద్యుత్ ఉద్యోగులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఏపీ జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబు ఆదేశాలను అనుసరించి ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాలని చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు ఉద్యోగులకు తెలియజేశారు. ఎఫ్ టైప్ అపార్ట్ మెంట్ వద్ద హానికరం చెత్త, తడి, పొడి చెత్తకు మూడు కుండీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ ప్రసాద్, డీఈ బి.బాలకృష్ణ, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రంచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొంటువానిపాలెం అటవీ ప్రాంతంలో శనివారం ఫారెస్టు రేంజ్ అధికారి గుమ్మడి ఉషారాణి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అటవీ ప్రాంతంలో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం అటవీ సంరక్షణతోపాటు అడవులను పరిశుభ్రంగా ఉంచడంలో తమ బాధ్యత నిర్వహిస్తామని అటవీ సిబ్బందితో రేంజ్ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్ ఎస్‌వోలు రాము, అర్జున్, బాలాజీ, సుబ్బయ్యమ్మ, ఎఫ్‌బీవోలు, బేస్‌క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

పరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వం ముందడుగు

● రేపు ముంపు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులతో సబ్ కలెక్టర్ సమీక్ష

కూనవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో పోలవరం నిర్వాసితులపట్ల నిర్లక్ష్యంగా ఉన్న వైసీపీ ప్రభుత్వం కారణంగా పరిహారం చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరిగిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం రాగానే పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల విషయంలో దూకుడు పెంచింది. నెలరోజుల క్రితం ఏలూరు జిల్లాలోని కూనవరంనకు ఎదురుగా ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాల నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో రూ.800కోట్లకుపైగా పరిహారం చెల్లించింది. తాజాగా ఇప్పుడు అల్లూరి జిల్లాలోని ముంపు మండలాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ముంపు మండలాల్లోని మొదటి ప్రాధాన్యం కలిగిన 32 ముంపు గ్రామాల సర్పంచ్‌లతోను అధికారులతోను సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఈ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో భూ సేకరణ, పునరావాసం, పునరావాస పరిహారంపై సమీక్షిస్తారు. కూనవరం మండలంలో తొమ్మిది మొదటి ప్రాధాన్యం గ్రామాలు జాబితా ఉన్నాయి. ముందుగా పెద ఆర్కూర్ గ్రామంలో 504 కుటుంబాలు, కోండ్రాజుపేట 254 కుటుంబాలు, కూడలిపాడు 188, టేకులబోరు 986, వాల్‌ఫర్‌పేట 55, కూనవరం 1345, టేకుబాక 223, పంద్రాజుపల్లి 340, శబరి కొత్తగూడెం 435 కుటుంబాలు మొదటి పరిహారం పొందే జాబితాలో ఉన్నాయి.

చికెన్ అమ్మకాలు చేయొద్దు

ఎటపాక,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో గ్రామాల్లో చికెన్ అమ్మకాలు చేయవద్దని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది చికెన్ దుకాణదారులకు సూచించారు. చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాలతో శుక్రవారం గ్రామాల్లోని దుకాణదారుల వద్దకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేశారు. బర్డ్‌ఫ్లూ తగ్గే వరకు మాంసం క్రయవిక్రయాలు జరపవద్దన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



గన్నవరంలో చికెన్ దుకాణదారుడికి నోటీసు అందజేస్తున్న దృశ్యం

ఇందుకూరు ప్రభుత్వ పాఠశాల తనిఖీ

దేవీపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు ప్రభుత్వ పాఠశాలను శనివారం ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను చూసి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు డీఈవో సూచించారు. ఆయన పాఠశాల రికార్డులు, రిజిస్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మొదటి ప్రాధాన్యతా ఓటును కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు వేసేలా చైతన్యం నింపాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో అభ్యర్థి రాజశేఖర్, పరిశీలకురాలు సుంకర పావని, కూటమి నేతలు వెలుగుల గోపాలకృష్ణ, బోనం చినబాబులతో కలిసి కూటమి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో యనమల రాజేష్, ఎస్.లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం కూటమి కార్యకర్తలు కృషిచేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం ములగపూడి, రౌతులపూడి స్కూల్స్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్డీయే శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎన్నికల పరిశీలకుడు గొంపా కృష్ణ అన్నారు. శనివారం కల్యాణ మండపంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చింతంనీడి కుమార్, బొర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



ఏలేశ్వరంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో సమావేశం జరిపి ఓట్లను అభ్యర్థించారు. పెద్దనాపల్లి గ్రామంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నేతృత్వంలో రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని పట్టభద్రులను కోరారు. ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ పట్టణ శాఖ ఎం.నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థో ఆసుపత్రి ప్రారంభం

జగ్గంపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వెంట్రాప్రగడ వీధిలో శనివారం శ్రీఅన్నపూర్ణ ఆర్థో హాస్పటల్‌ను ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు ప్రారంభ వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్, జగ్గంపేట గ్రామానికి చెందిన డాక్టర్ వెంట్రాప్రగడ రామకృష్ణమూర్తి ఆర్థో సేవలు అందిస్తున్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కుంచే రాజా, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, సీనియర్ వైద్యులు డాక్టర్ గోలి శ్రీరాములు, ఆదిత్య హాస్పటల్స్ అధినేత డాక్టర్ బాలగంగాధర్‌రావు, పారిశ్రామికవేత్త కె.భైరవకృష్ణ, వెంట్రాప్రగడ రాధాకృష్ణారావు, వేములకొండ జోగారావు, బండారు రాజా, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు

పాలెంలో అన్నదానం

కిర్లంపూడి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెంలో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద భీష్మ ఏకాదశి సందర్భంగా మాఘ శనివారాన్ని పురస్కరించుకుని అన్నదానం జరిపారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల రవికిశోర్, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాఠంశెట్టి మురళీకృష్ణ, ఆళ్ల శివబాబు, అడబాల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని తరిమేద్దాం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యాన్ని తరిమేద్దామని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా లింగంపర్తి గ్రామంలో పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి తడిపొడి చెత్తను వేరు చేశారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఏలేశ్వరం ఆసుపత్రి పరిధిలో వైద్య సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి, రోగులకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కలశాలతో ఊరేగింపు



కోటనందూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పాతకొట్టాం గ్రామంలో గల సీతారామచంద్ర స్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సప్తనదీ జలాలతో నింపిన బోనాలను ఊరేగింపు ఆలయ ధర్మకర్త యడ్ల చెల్లారావు ఆధ్వరంలో నిర్వహించారు. 1000మందితో కలశాలను గ్రామంలో హరినామ సంకీర్తన చేస్తూ వాటితో జలాభిషేకం చేశారు. కమిటీ సభ్యులు అప్పారావు, నరసింగరావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో శివ, కేశవుల ప్రతిష్ఠ పూజలు



పూజలు చేస్తున్న నెహ్రూ దంపతులు

జగ్గంపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక గ్రామంలో హరిహర ఆలయ సముదాయంలో పాణింగిపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నాల్గవ రోజు శివ, కేశవుల ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ భాగంగా మూడో రోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పలు కార్యక్రమాలు జరిగాయి. కోటిలింగేశ్వరుడికి వినాయకపూజ, పుణ్యాహవచనం తదితర పలు పూజలు నిర్వహించారు. సాయంత్రం కోటింగేశ్వరస్వామికి క్షీరాదివాసం, నీరాజన మంత్రపుష్పాలు, దర్బారు సేవ నిర్వహించారు. ఈనెల 17న శివ కేశవుల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన పూజల్లో జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి దంపతులు, తోట సర్వారాయుడు, సునీత దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవిందనామ స్మరణలు, పండితుల మంత్రోచ్ఛారణల మధ్య తూర్పురాజగోపురం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ జరిపారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకువెళ్లారు.

వరి పొలాల పరిశీలన

తొండంగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ శనివారం ఏవి నగరం, కోదాడ, ఏ.కొత్తపల్లి తదితర గ్రామాల్లోని వరిపొలాలను పరిశీలించారు. ఉప్పు చెరువు కింద ఉన్న పొలాలకు నీటిఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామనిరైతులకు తెలిపారు.

విద్యా సంస్థల్లో స్వచ్ఛాంధ్ర

తొండంగి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు, పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు తడి, పొడిచెత్తను వేరుచేసి వేర్వేరు డబ్బాల్లో వేశారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ జరిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కోరారు. ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులతో మాట్లాడారు. సెల్‌ఫోన్‌లో వచ్చే సందేశాలకు స్పందించవద్దన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

శంఖవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకి విశిష్ట సంఖ్య తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. శనివారం నెల్లిపూడి సచివాలయంలో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు విశిష్ట సంఖ్యపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి పి.గాంధీ, ఏఈవో శ్రీనివాస్, వికాస్, సీత పాల్గొన్నారు.

'ఆదిత్య'లో సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కళాశాలలో శనివారం ది సీక్రెట్ ఆఫ్ అల్టిమేట్ లివింగ్ అంశంపై బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోన్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సచిన్ పరబ్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకేఎస్ సుబ్బారావు, అకడమిక్స్ డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయండి'

● జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌పీ ఫంక్షన్‌హాల్లో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ బూత్ ఏజెంట్లు, మండలపార్టీ అధ్యక్షుడు క్షేత్రస్థాయిలో ప్రతిఓటరును కలిసి ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, 11 మండలాల టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్‌ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోరుతూ శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి, రాజవొమ్మంగిలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన కేశవ్, గణజాల తాతారావు, చీడిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని క్లస్టర్ ఇన్‌చార్జి టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు అన్నారు. కూనవరంలో పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులపట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. వాళ్ల లక్ష్యాన్ని నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, బీజేపీ నాయకులు రామారావు, టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, జనసేన మండలాధ్యక్షుడు దాసరి నరేంద్ర పాల్గొన్నారు.

శివకేశవుల ప్రతిష్ఠకు సరస్వతి స్వామీజీకి ఆహ్వానం

జగ్గంపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక ఏలేరు నది తీరాన ఉన్న శివకేశవుల ఆలయం వద్ద ఈనెల17నవైభవంగా జరుగుతున్న శివకేశవుల ప్రతిష్ఠకు రావలసిందిగా తుని తపోవనం స్వామీజీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీకి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆహ్వాన పత్రిక అందించారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ శివకేశవుల ప్రతిష్ఠతో ఈప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టిన నెహ్రూకి శివకేశవుల ఆశీస్సులు ఉంటాయన్నారు. భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో సెమినార్

గండేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ప్రపంచ పంగోలిన్ డే సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు సెమినార్ నిర్వహించినట్లు ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఈశ్వర్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బయో డైవర్సిటీపై ఆయన చేసిన పలు పరిశోధనలు, వాటి మూలాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్, డీన్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.రాంబాబు, రెహ్మాన్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామంలో శివరాత్రి ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల22నుంచి జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటీ నేతృత్వంలో పురోహితులు వై.రామకృష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి పందిరిరాట ముహూర్తం చేశారు. అనపర్తి భాను, ధనేకుల వీర భద్రరావు, వెలుగూరి వెలుగూరి హరేరామ్, రామలింగేశ్వరరావు, అల్లం ఆదినారాయణ, చిలకమర్తి ఆదినారాయణ పాల్గొన్నారు.